క్లుప్తంగా

30న మునిసిపల్ సాధారణ సమావేశం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ విజయసారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి అంశాలపై మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎంపీపీకి సన్మానం

భట్టిప్రోలు: ఎంపీపీగా దావూరి వెంకట లలిత కుమారి రెండేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వేమూరు నియోజకవర్గ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, మల్లేశ్వరరావు దంపతులను సన్మానించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, వెల్లటూరు సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ స్వచ్ఛత పక్వాడ ప్రదర్శన



బాపట్ల: బాపట్ల మున్సిపల్ హైస్కూలు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ పట్టణంలో స్వచ్ఛత పక్వాడా ప్రదర్శన చేపట్టారు. ఎన్‌సీసీ అధికారి కత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రదర్శన ప్రారంభించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. స్వచ్ఛభారత్, క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా అంటూ విద్యార్థులు నినాదాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు వై.ప్రసాద్, సుబేదార్ సేవాదేవ అవల్దార్ కుషేబీర్‌సింగ్, ప్రవీణ్ తివారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అంజుమన్ చేయూత

పొన్నూరు: మీలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద ముస్లింల వివాహానికి పలు వస్తువులు, నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ (మాము) పాల్గొని మహిళలు ముగ్గురికి రూ.30 వేలు, మరో ఇరువురికి వస్తువులు అందజేశారు. అర్బన్ సీఐ ఎండీ అల్తాఫ్ హుస్సేన్ పాల్గొని ముస్లిం మహిళలకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సైపుల్లా, కమిటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ నెల 29న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేష్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని 11 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, గ్యాస్ట్రిక్, కంటి సమస్యలు, జనరల్ సర్జన్, ప్రసూతి, గుండె సంబంధిత సమస్యలు, తదితర ఆరోగ్య సమస్యలకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పొన్నూరు, మండల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రేష్మ సూచించారు.

తరచూ రక్తదానంతో గుండెజబ్బులు దూరం

తెనాలి: తరచూ రక్తదానం చేస్తే గుండెజబ్బులు రావని ప్రియదర్శిని డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ సహకారంతో కాలేజీలో బుధవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంతో చెడు కొలెస్ట్రాల్ విభజన జరుగుతుందన్నారు. క్యాన్సర్ కణాలు నియంత్రణలో ఉంటాయని చెప్పారు. గుండెపోటు, మెదడుపోటు వంటివి తగ్గుతాయని వివరించారు. హ్యాపీ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ వైద్యనిపుణురాలు డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రక్తదానం ఆవశ్యకతపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులతోపాటు డాక్టర్ మహేష్, ఆయన సోదరుడు ప్రదీప్‌లు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని మద్యం దుకాణాల్లో సీసాలను కొనుగోలు చేసి తరలిస్తున్నడన్న పక్కా సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని వద్ద 10 క్వార్టరు సీసాలు లభించాయి. మూడు కంటే ఎక్కువ సీసాలను కలిగి ఉండకూడదన్న నిబంధనలు ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశారు. నిందితుడిని బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపనికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతకు మరో అవకాశం

–ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకరరావు



వాల్‌పోస్టర్‌లను విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ సుధాకరరావు

రేపల్లె: ఇంటర్మీడియెట్‌లో గతంలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు పరీక్ష రాసి పూర్తిచేసుకునేందుకు ఇంటర్ విద్యా మండలి అవకాశం కల్పించిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.సుధాకరరావు అన్నారు. ఇంటర్మీడియట్ బ్యాక్ లాగ్ వాల్ పోస్టర్, డిజీ లాకర్ పోస్టర్, హెచ్‌సీఎల్‌టెక్ పోస్టర్‌లను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో, గతంలో ఇంటర్ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు అక్టోబరు 3వ తేదీలోపు ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఫీజు చెల్లించిన విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాల తరగతులకు కూడా హాజరుకావచ్చునని వెల్లడించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఫీజులు చెల్లించిన విద్యార్థులు సబ్జెక్టు వారీగా కూడా రేపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజీ తరగతులకు హాజరు కావచ్చన్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ సుధాకర్ తెలియజేశారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం హెచ్‌సీఎల్ టెక్ కెరీర్ గైడెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను వివరించారు. డిజీ లాకర్ ద్వారా పోయిన సర్టిఫికెట్లను తిరిగి పొందేవిధానాన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జవహర్ బాబు, అధ్యాపకులు పాండు రంగారావు, ఎస్వీ పద్మావతి, కోటి లింగేశ్వరరావు, అనురాధ, విజయ కళ, వై.ఎస్.ఆర్, నాగమ్మ, భార్గవి, సురేష్ ప్రమోద్, శివరామి రెడ్డి పాల్గొన్నారు.

కార్యాచరణ కమిటీల నియామకం



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యాచరణ కమిటీల సమావేశం నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్ జలజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు విభాగాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ ఛైర్మన్‌గా ఎంపీపీ లలిత కుమారి, కన్వీనర్‌గా ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, సభ్యులుగా ఎంపీటీసీలు నీలా సాంబమ్మ, గద్దె సుశీల, వరికూటి పున్నయ్య, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, మౌళిక సదుపాయాల కార్యాచరణ కమిటీ ఛైర్మన్‌గా వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కన్వీనర్‌గా ఎంపీడీవో చంద్రశేఖరరావు, సభ్యులుగా ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, దారావత్ కుమారిభాయ్, వాకా వెంకటనారాయణ, మురుగుడు శ్రీనివాసరావు, మానవ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ ఛైర్మన్‌గా సూరేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, కన్వీనర్‌గా ఎంపీడీఓ చంద్రశేఖరరావు, సభ్యులుగా వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, డొక్కు నాగ కుమారి, నన్నెపాముల చంటి, దున్నా తిరుపతిబాబులు ఎన్నికయ్యారు.

పెసర్లంకలో నియోజకవర్గ ఖోఖో జట్ల ఎంపికలు



ఖోఖో జట్లకు ఎంపికైన విద్యార్థులతో ప్రజా ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు

పెసర్లంక(భట్టిప్రోలు): మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వేమూరు నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ప్రారంభించారు. పోటీల నిర్వహణకు పెసర్లంక సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు రూ. 10వేలువిరాళం అందజేశారు. వేమూరు, కొల్లూరు, చుండూరు, అమృతలూరు మండలాలల నుంచి ఆయా హైస్కూళ్ల విద్యార్థులు హాజరయ్యారు. అండర్–14, 17 విభాగాలలో 48 మందిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు కో–ఆర్డినేటర్, ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్ తెలిపారు. పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మి, నాగేశ్వరరావు, బుచ్చిరెడ్డి, శ్రీనివాసరావు, గోపాల్‌రెడ్డి, పీఈటీలు చేబ్రోలు శ్రీనివాసరావు, జీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఎంతవోలు పులి లాజర్, నీలం దేవరాజ్, చింతమోటు, పెసర్లంక సర్పంచులు గుమ్మడి శంకరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, వీరాంజనేయులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా పాల్గొన్నారు.

విఠలేశ్వర నగర్ కాలనీని సందర్శించిన డీపీవో



అధికారులు, ప్రజా ప్రతినిధలతో మాట్లాడుతున్న డీపీవో రాంబాబు

భట్టిప్రోలు: స్థానిక విఠలేశ్వరనగర్ కాలనీలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా జలదిగ్బంధం కావడంతో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) దాసరి రాంబాబు బుధవారం రాత్రి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కాలనీ వాసులు సమస్యల ఏకరువు పెట్టారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీ జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. అలాగే దోమలు కూడా విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండటంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం డ్రైయినేజీ మార్గం లేకపోవడం వల్ల నీరు నిల్వ చేరుతుందని వివరించారు. దీంతో స్పందించిన పంచాయతీ, ఇరిగేషన్ శాఖాధికారులతో మాట్లాడి వెల్లటూరు చానల్‌లో నీరు తగ్గించేలా చూడాలని డీపీఓ కోరారు. ప్రస్తుతం కాలనీలో ఆక్రమణలు ఏర్పడటంతో కొంతమేర సమస్య నెలకొందని, వెంటనే వారికి నోటీసులు అందించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పంచాయతీ వార్డు సభ్యులు ఇస్మాయిల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పేదలకు తక్కువ ధరకే ఆహారం

ఆహా క్యాంటీన్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ విజయసారథి

రేపల్లె రూరల్: పేదలకు తక్కువ ధరలకే ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆహా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జ్యోతి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలకు తక్కువ ధరకు ఆహారం అందించటంతో పాటు స్వయం సహాయక బృందాలకు ఆహా క్యాంటీన్‌లతో ఉపాధి కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంటీన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

జిల్లా అధికారుల బృందం పర్యటన



సూచనలు అందజేస్తున్న జిల్లా అధికారులు

గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం డీఈయూ రమేష్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో జిల్లా బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, ఇంకుడు గుంతలు సామూహిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా బృందం పర్యటించటం జరిగిందన్నారు. గ్రామాలను పరిశీలించి దేశ స్థాయిలోనే ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు తగిన సూచనలు, సలహాలు సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగపు ఏఈ వినీల్ కుమార్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్స్ షఫీ, సాయి, స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సీ డి.శ్రీనివాసరావు, నడింపాలెం పంచాయతీ కార్యదర్శి ఖాజా, నడింపాలెం, తుమ్మలపాలెం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ రోహిణి, నాగరాజు, ఐటీసీ ప్రతినిధులు అరుణ, ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరునికి పూజలు



పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో విఘ్నేశ్వరునికి బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రజలు పూజలు నిర్వహించారు. పలు గ్రామాలలో వినాయకుని విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, చోడిపాలెం గ్రామాలలో విఘ్నేశ్వరుని గ్రామోత్సవం అనంతరం పిట్టలవానిపాలెం శివారులోని పంట కాలువలో నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 'హైవెండ్' విద్యార్థులు



కర్లపాలెం: తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికవటం పాఠశాలకు గర్వకారణమని హైవెండ్ స్కూల్ హెచ్ఎం ఎస్.లక్ష్మి అన్నారు. హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 20న జమ్ములపాలెం హైస్కూల్‌లో జిల్లా స్కూల్ గేమ్స్‌లో 8వ తరగతి విద్యార్థి పి.భానుచంద్రారెడ్డి, 9వ తరగతి విద్యార్థి కె.సౌజన్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి.చాందినీ, మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్రబాబు, చైర్మన్ పి.ఉదయ్‌చంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాయపూడి గోపిచంద్ ఉన్నారు.

అనుమతుల్లేని సేంద్రియ ఉత్పత్తులు సీజ్



సీజ్ చేసిన ఉత్పత్తులు

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి గ్రామంలో అనుమతులు లేకుండా సేంద్రియ ఉత్పత్తులు తయారు చేస్తున్న ఎస్ఎల్ఎన్ చంపాక్ కంపెనీపై గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బుధవారం దాడులు నిర్వహించారు. వ్యాపార లైసెన్సు, సేంద్రియ ఉత్పత్తులు తయారు చేయడానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఉత్పత్తులు తయారు చేస్తున్నారని విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ. కోటి మూడు లక్షల విలువచేసే ఉత్పత్తులను సీజ్ చేశారు. కంపెనీ నిర్వాహకుడు రమా రంజన్ బాబుపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామచంద్రరెడ్డి, ఏవో రమణ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో ముమ్మనేని భానుమతి

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కాలేజీలో బుధవారం సాయంత్రం రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తదానం చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్నవారికి రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, మేనేజింగ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానిరసూల్, వైష్ణవి కాలేజీ ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లింలకు పెద్దపీట వేస్తున్న జగనన్న

- బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ ఇమామ్ హుస్సేన్
- దిగ్విజయంగా ముగిసిన వైఎస్సార్ హమ్ సబ్ జగనన్న కార్యక్రమం



మత పెద్దలతో షేక్ ఇమామ్ హుస్సేన్

అమృతలూరు(భట్టిప్రోలు): జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లలో ముస్లిం, మైనార్టీల అభివృద్ధి కోసం రూ. 25 వేల కోట్లు ఖర్చు పెట్టి, పెద్ద పీట వేసిందని బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ ఇమామ్ హుస్సేన్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో గత ఆగస్టు నుంచి ఈ నెల 26వ తేదీ వరకు నిర్వహించిన వైఎస్సార్ హమ్ సబ్ జగనన్నతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసిందని బుధవారం ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం జిల్లా పరిధిలోని చీరాల, అద్దంకి, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలోని 200 మసీదులకు వెళ్లి గత ప్రభుత్వం నిర్వహించిన పథకాలు, జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కరణం వెంకటేష్, బాచిన కృష్ణచైతన్య, ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు వి. ఖాదర్ బాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఎం. బాజీ వలి, వక్ఫ్ బోర్డు సెక్రటరీ మస్తాన్‌వలి, వక్ఫ్ డెరెక్టర్ షేక్ పీర్, ఆయా నియోజకవర్గాల మైనార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతులతో ఆక్వాలో అధిక లాభాలు

ఏఎన్‌యూ ప్రొఫెసర్ పీవీ కృష్ణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీవీ కృష్ణ

నగరం: ఆక్వా సాగులో ఆధునాతన పద్ధతులను అవలంబించడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చునని ఏఎన్‌యూ ప్రొఫెసర్ పీవీ కృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఆక్వా కల్చర్‌లో మంచి యాజమాన్య పద్ధతులు అనే అంశంపై బుధవారం జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. యాంత్రీకరణ పద్ధతులతో ఆక్వా సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించవచ్చునన్నారు. ఆక్వా సాగులో తీసుకోవాల్సిన జాగత్తలు, జాతులు, ఆహారపు అలవాట్లు, వ్యాధుల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు సాంప్రదాయ, అధునాతన పద్ధతులను వివరించారు. ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ, జువాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక శాస్త్రం ప్రాజెక్ట్ వర్క్



విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం సోషల్ స్టడీస్ ప్రాజెక్ట్ వర్క్ నిర్వహించారు. ఇందులో భాగంగా భారత దేశ ఉనికి, అక్షాంశాలు, రేఖాంశాలు, కర్కాటక రేఖ శిఖరాలు అనే అంశంపై దేశ చిత్ర పటాన్ని విద్యార్థులు తీర్చిదిద్దారు. ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణ కుమారి మాట్లాడుతూ ఇటువంటి ప్రాజెక్టులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సహకార భావం, పని పట్ల గౌరవం, సమష్టి బాధ్యత కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఎస్కే సుభానీ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు ఆశలత, హరిప్రసాద్, శివరామకృష్ణ, ఎస్టేట్‌బాబు, కుటుంబరావు, శ్రీనివాసరావు, రామారావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో రూ. 9 లక్షల వ్యయంతో (గడప గడపకు నిధులు) సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆ వార్డు సభ్యులు పెరికల శ్యామ్ భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ గద్దె సుశీల, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు అబ్దుల్ కరీమ్, వంగర వీరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు శ్రీనివాసరావు, ఉక్కదాల ఆనంద్, దారా చెన్నయ్య, కుందేటి రమేష్, దాసరి గోపాలరావు, పసుపులేటి శివరామప్రసాద్, దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



కర్లపాలెం: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తవ్వి తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని బాపట్ల సెబ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండల పరిధిలోని నల్లమోతువారిపాలెం గ్రామంలో అక్రమంగా తవ్వి నిలువచేసి ఉంచిన 1000 టన్నుల ఇసుక దిబ్బలను తమకందిన సమాచారం మేరకు సెబ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గం పరిధిలో ఇసుక(బుసక) ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వి తరలించటం చట్టరీత్యా నేరమని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై పొలంబడి



పెదకాకాని: రైతులు వరిపైరులో ప్రస్తుతం రసాయన పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా శత్రుపురుగులను ఆహారంగా తినే మిత్ర పురుగులన్నీ చనిపోతాయని ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోళ్ళమూడి గ్రామంలో బుధవారం జరిగిన వరి పంటలో పొలంబడి కార్యక్రమానికి వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుంటూరు సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపైరులో శత్రు పురుగుల నివారణకు వేపగింజల కషాయం పైరుపై పిచికారీ చేయాలన్నారు. వరిపంట పిలకల దశలో ఉందన్నారు. పొలంలో పది మొక్కల దుబ్బులను పరిశీలించారు. క్షేత్ర దీర్ఘకాల అధ్యయనాల పొలంబడి రైతుల చేత ప్రయోగాత్మకంగా పిలకలు తొలగింపు చేశారు. వరిలో కాండం తొలచు పురుగు వలన కొన్ని పిలకలు నష్టపరచినా వరిమొక్కకు తిరిగి పిలకలు తొడిగే సామర్థ్యం ఉందన్నారు. వరి పంటలో అధికంగా ఉన్న నీటిని తీసివేసి 2–3 సెంటీమీటర్ల నీరు మాత్రమే ఉంచాలన్నారు. తద్వారా వరి మొక్క అధికంగా పిలకలు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీఏఏలు పాల్గొన్నారు.